క్లుప్తంగా

రైతుల కష్టం తెలిసిన నేత సీఎం కేసీఆర్


నాగేశ్వరరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే

కారేపల్లి: రైతుల కష్టం తెలిసిన నేత సీఎం కేసీఆర్, అందుకే అన్నదాతల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ తెలిపారు. రైతు బంధు సమితి మండల కన్వీనర్‌గా నియమితులైన ఈసాల నాగేశ్వరరావుకు శనివారం ఎమ్మెల్యే ఉత్తర్వులు అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దబోయిన ఉమాశంకర్, ఇస్లావత్ భన్సీలాల్‌తో పాటు దుగ్గినేని శ్రీనివాసరావు, రావూరి శ్రీనివాసరావు, నర్సింగ్ శ్రీనివాసరావు, శివరాత్రి అచ్చయ్య, భూక్యా రంగారావు, కుర్సం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన

వైరా: వైరా మున్సిపాలిటీలో శనివారం ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ విస్తృతంగా పర్యటించారు. పలు వార్డుల్లో అభివృద్ధి పనులు పరిశీలించారు. పలు కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలేవి..?


దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సత్తుపల్లిరూరల్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సత్తుపల్లి తహసీల్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు కొలిక పోగు వెంకటేశ్వరరావు మాట్లాడారు. అవినీతికి పాల్పడిన ఎవ్వరిని వదిలి పెట్టమని, రాష్ట్ర వ్యాప్త కలెక్టరేట్ల ముట్టడి ద్వారా తమ సత్తా ఎంటో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, లక్ష్మణ్, ముత్తారావు, అర్జున్, వెంకటేశ్వర్లు, రవి, రాఘవ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

కల్లూరు: దళితబంధు యూనిట్ల పంపిణీలో అక్రమాలపై విచారణ జరిపించి దోషులను శిక్షించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొండూరు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కల్లూరులో శనివారం ఆయన మాట్లాడుతూ దళితులకు అందాల్సిన యూనిట్లలోనూ కమీషన్లు దండుకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఈనెల 8న సరూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న యువ సంఘర్షణ సభకు నిరుద్యోగులు, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.

ప్రియాంక సభకు తరలి రావాలి

వైరా: ఈ నెల 8న హైదరాబాద్‌లో ఏఐసీసీ అగ్ర నేత ప్రియాంకాగాంధీ పాల్గొనే నిరుద్యోగ నిరసన ర్యాలీ సభకు కార్యకర్తలు భారీగా హాజరై జయప్రదం చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ దర్జీ చెన్నారావు పిలుపునిచ్చారు. శనివారం వైరాలో నిర్వహించిన ఎస్సీ సెల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రియాంక గాంధీ తొలిసారి తెలంగాణలో పర్యటిస్తున్నారని నిరుద్యోగులు, యువతీ యువకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఇందిరమ్మ అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు భరత్ కుమార్, శివ, ప్రవీణ్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

మధిర: మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఆ ఫౌండేషన్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కోనా నరసింహారావు సతీమని లక్ష్మి పుట్టినరోజు సందర్భంగా పండ్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు దాసు పాల్గొని మాట్లాడారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు అనీల్ కుమార్, హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోనకల్: గ్రామదీపికల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మె శనివారం 5వ రోజుకు చేరింది. గ్రామ దీపికలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ దీపికలు పద్మ, రామ్మోహనాచార్యులు, వెంకటేశ్వర్లు, రేణుక, శాంతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ యంత్రం.. భవితకు మంత్రం

- కంప్యూటర్ శిక్షణపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- కొత్త కోర్సులతో ఆకట్టుకుంటున్న నిర్వాహకులు


వైరాలోని కంప్యూటర్స్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

సండే స్పెషల్

వైరారూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం అందరికీ తప్పనిసరైంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులు వేసవి సేలవుల్లో తమ పిల్లలను కంప్యూటర్ పరిజ్ఞానం కోసం శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు వేసవి సెలవులు వస్తున్నాంటే చాలు ఆట, పాటలపై ఆసక్తి చూపే విద్యార్థులు ఇప్పుడు ఏ కొంచెం సమయం దొరికినా కంప్యూటర్ ముందు వాలిపోతున్నారు. తమకు నచ్చిన కంప్యూటర్ కోర్సులు నేర్చుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు వైరా పట్టణ కేంద్రంలోని పలు కంప్యూటర్ ఇనిస్ట్యూట్ వస్తున్న నేపథ్యంలో.. ఇనిస్ట్యూట్ నిర్వాహకులు సమ్మర్ ఆఫర్లు పెట్టి మరి విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు.

కంప్యూటర్‌పై ఆసక్తితో..

పాఠశాలలోని వివిధ తరగతుల విద్యార్థులతో పాటు పది, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ముగియడం వలన ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించింది. దీంతో విద్యార్థులు కంప్యూటర్‌పై ఆసక్తితో సమయాన్ని వృథా చేయకుండా కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నారు. మరికొంత మంది విద్యార్థులు ఆంగ్ల భాష నేర్చుకునేందుకు స్పొకెన్ ఇంగ్లీష్ తరగతులకు వెళ్తున్నారు. ఈ విధంగా 5 నుంచి 10వ తరగతి విద్యార్థులందరూ కంప్యూటర్ శిక్షణపై ఆసక్తి కనబరుస్తున్నారు.


కంప్యూటర్ బేసిక్స్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నిర్వాహకుల ఆఫర్లు..

విద్యార్థులను ఆకట్టుకునేందుకు ఇనిస్ట్యూట్ నిర్వాహకులు సమ్మర్ ఆఫర్లు ఇస్తున్నారు. గవర్నమెంట్ స్కీంల పరిధిలోని ఇనిస్ట్యూట్‌లో పీజీడీసీఏ, ఎంఎస్ ఆఫీస్ తదితర కోర్సులు నేర్చేందుకు రూ.6,000 వరకు చెల్లించాల్సి వస్తుంది. అదే ప్రైవేట్ ఇనిస్ట్యూట్‌లలో 50 శాతం ఫీజు రాయితీ సౌకర్యం కల్పించి అవే కోర్సులను రూ.3,000లకు నేర్పించడమే కాకుండా సెంట్రల్ గవర్నమెంట్ అనుమతి పొందిన సర్టిఫికేట్లను అందిస్తున్నారు. అదే విధంగా చిన్నారులకు కంప్యూటర్ బేసిక్‌లు రూ.1500 ఫీజు తీసుకోని నెలన్నర వ్యవధిని చిన్నారులకు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు కూడా వారికి కేటాయించిన సమయానికే ఇనిస్ట్యూట్‌లకు వెళ్తూ కంప్యూటర్ శిక్షణను పొందుతున్నారు.

అందుబాటులో అనేక కోర్సులు..

కంప్యూటర్ శిక్షణ పొందే విద్యార్థులకు ఇనిస్ట్యూట్‌ల నిర్వాహకులు అనేక కోర్సులను అందుబాటులో ఉంచుతున్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల సౌలభ్యానికి అనుగుణంగా కంప్యూటర్ శిక్షణలో బేసిక్ నుండి డీసీఏ, పీజీడీసీఏ, ఎంఎస్ ఆఫీస్, తెలుగు, ఇంగ్లీష్ డీటీపీ, ఫోటోషాప్, పేజీమేకర్, ట్యాలీ, సీ లాంగ్వేజ్, హార్డ్‌వేర్, ఇంటర్నెట్ కాంసెప్ట్, జాబ్‌వర్క్‌తో పాటు పలు రకాల కోర్సులు ఉందుబాటులో ఉన్నాయి. ఇనిస్ట్యూట్ నిర్వాహకులు కోర్సులను బట్టి విద్యార్థులకు కాల వ్యవధిని నిర్దేశించి కంప్యూటర్ శిక్షణ తరగతులకు ఆహ్వానిస్తున్నారు. అంతేకాకుండా డీగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు వారు నేర్చుకున్న కంప్యూటర్ కోర్సు ఆధారంగా ఇంటర్నెట్ సెంటర్లు, కాలేజీలు, ఆసుపత్రులు తదితర వాటిల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తూ.. ఉద్యోగ భృతితో కుటుంబాలకు ఆసరగా నిలుస్తున్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



ప్రస్తుత కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరం. దీని ఆవశ్యకత తెలుసుకున్నాక నేను వైరాలోని లైఫ్ కంప్యూటర్స్ కోచింగ్ సెంటర్‌లో చేరాను. ప్రస్తుతం బేసిక్స్ నేర్చుకుంటున్నా.. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా అన్ని కంప్యూటర్ కోర్సులు నేర్చుకోని దానిపై పట్టు సాధించడమే లక్ష్యం.

– శ్రీ మనోజ్‌కుమార్, 6వ తరగతి విద్యార్థి, తాటిపూడి

భవిష్యత్ ప్రణాళిక కోసం..



నేను వైరాలోని సాస్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్లో చేరాను. భవిష్యత్‌లో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పీజీడీసీఏ, డేటా ఎంట్రీ తదితర కోర్సులు నేర్చుకుంటున్నాను. ఉద్యోగ అవకాశాల కోసం కంప్యూటర్ కోర్సులు నేర్చుకోక తప్పడం లేదు.

– షేక్.నస్రీన్, డిగ్రీ విద్యార్థిని,సిద్ధిక్‌నగర్

పోటీ ప్రపంచంలో కంప్యూటర్ ప్రథమం..



భవిష్యత్‌లో పిల్లలు పోటీ పరీక్షలు రాయాలన్నా, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. విద్యార్థులు ఇప్పుడు సమయాన్ని వృథా చేస్తే రేపటి కాలం చాలా భాదపడాల్సి ఉంటుంది. అందుకే మా పాపను కంప్యూటర్ కోర్స్‌లో చేర్పించాం.

– సురేష్, గండుగుల పాడు

కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

కల్లూరు: ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కనిపించడం లేదని కాంగ్రెస్ నాయకులు శనివారం కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడుతుంటే సమస్య వివరించేందుకు ఎమ్మెల్యే అందుబాటులో లేరని ఫిర్యాదులో పేర్కొన్నారు. నాయకులుదామాల రాజు, కర్నాటి వెంకటరెడ్డి, ఎస్.కే.జానీపాషా, గుగులోత్ సీతారాములు, సయ్యద్ ముస్తఫా, కంభం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్వహణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మంద నర్సింహారావు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని జేవీఆర్ సీహెచ్‌పీలో నిర్వహణ లోపించడంతో తరచూ మరమ్మతులు వస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. ఓసీలో శనివారం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీలో మరమ్మతుల కారణంగా బొగ్గు రవాణాకు అంతరాయం వాటిల్లుతోందన్నారు. ఇకనైనా యజమాన్యం నిర్వహణపై దృష్టి సారించేలా చూడడంతోపాటు కిష్టారం ఓసీ కాలనీలో కనీస వసతులు కల్పించాలని కోరారు. నాయకులు కర్ల వీరస్వామి, బి.ప్రకాష్, రమణ, సర్వేశ్వరరావు, ఎం.నాగరాజు, రాయల వెంకన్న, మంగ రమేష్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత సూచనలు పాటించాలి


మధిర: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మధిర/కొణిజర్ల: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రత సూచనలు పాటించాలని మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ, పెద్దగోపతి సెక్షన్ ఏడీఈ బి.తిలక్ సూచించారు. శనివారం విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా మధిర పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కొణిజర్లలోని పెద్దగోపతిలో విద్యుత్ ఉపకరణాలతో జాగ్రత్తగా ఉండటానికి తీసుకోవలసిన రక్షణ చర్యలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఏడీఈ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు ప్రమాదాలు జరకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఆకాల వర్షాలు గాలి దుమ్ములు వస్తున్నందున వర్షం కురిసే సమయంలో విద్యుత్ స్తంభాల వద్దకు పోవద్దన్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలకు తగులుతున్న విద్యుత్ తీగలను ముట్టుకోవద్దన్నారు. సొంతంగా ఫ్యూజులు మార్చడం వంటివి చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మధిర సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు అనీల్ కుమార్, నాగేశ్వరరావు, అనూష, శ్రీనివాసరావు, సిబ్బంది సీహెచ్ ప్రభాకర్, చెరుపల్లి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, కొణిజర్ల ఏఈ సురేష్, ఎల్ఐ సీతారామారాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీకి గురవుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

సత్తుపల్లిరూరల్: సోలార్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు శ్రమదోపిడీకి గురువుతున్నారని ఏఐటీయూసీ నాయకుడు గత్తుల సత్యనారాయణ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం సత్తుపల్లిలోని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యేసుపాదం కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో పని చేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు ప్రభుత్వ జీఓ ప్రకారం వేతనం చెల్లించడం జరుగుతుందని.. కానీ సోలార్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు శ్రమదోపిడీ జరుగుతుందన్నారు. స్పందించిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మాట్లాడుతూ.. సోలార్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గుత్తుల సత్యనారాయణ, తడికమళ్ల యోబు, కార్మికులు ఎండీ కరీంపాషా, జహీర్, మనోజ్, నర్సింహారావు ఉన్నారు.


అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యేసుపాదంకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఘనంగా కార్ల్ మార్క్స జయంతి


మార్క్స చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వైరా: వైరా మున్సిపాలిటీలోని సీపీఎం కార్యాలయంలో శనివారం కార్ల్ మార్క్స జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు మార్క్స చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు మాట్లాడుతూ.. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు మార్క్స అన్నారు. కార్యక్రమంలో సమత, రమేష్, మండల కార్యదర్శి నాగేశ్వరరావు, తాటిపూడి సర్పంచ్ భద్రయ్య, ఎంపీటీసీ కాటమరాజు, పారుపల్లి కృష్ణారావు, వాసు, రామారావు, రమణ, అమరేంద్ర, మజిద్, మధు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


మంగళసూత్రం చూపుతున్న అర్చకులు

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి స్వామి కల్యాణ వేడుకలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని సర్పంచ్ వినోద, మోహన్‌రావు దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం


బోనకల్: నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోనకల్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కూరపాటి సునీల్ మాదిగ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాజన సోషలిస్టు పార్టీ ద్వారానే మహాజన కులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మధిర నియోజక వర్గ ఇన్‌చార్జ్ హనుమంతరావు, వెంకటరత్నం, శ్రీను, చిన్నసైదులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై స్పష్టత ఇవ్వాలి..

పెనుబల్లి : ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ స్పష్టత ఇవ్వాలని ఎంఎస్పీ జిల్లా కో ఆర్డినేటర్ ఏపూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, పుల్లయ్య, శ్రీను, ప్రభుదేవా, రామకృష్ణ, బాలరాజు, ప్రసాద్

హైకోర్టు ఏజీపీ రమేష్‌కు సత్కారం


హైకోర్టు ఏజీపీ రమేష్‌ను సత్కరిస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

సత్తుపల్లిటౌన్ : తెలంగాణ హైకోర్టు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్‌గా కోయ సామాజిక వర్గానికి చెందిన పెనుబల్లి రమేష్‌ను నియమించటం ఆదివాసీ సంఘానికి దక్కిన గౌరవమని వక్తలు కొనియాడారు. సత్తుపల్లిలో హైకోర్టు ఏజీపీ పెనుబల్లి రమేష్‌ను ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ కె.రాజారావు, జె.ప్రదీప్, ఎంపీటీసీ ఇరపా కృష్ణారావు, న్యాయవాదులు నల్లగట్ల విజయ్‌కుమార్, తామా బాలరాజు, జారె నాగరాజు, ప్రవీణ్, మూర్తి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


తలసేమియా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీష్‌రావు

సత్తుపల్లి: మే 8న ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు సత్తుపల్లికి చెందిన యువభారత్‌శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పోస్టర్లను రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి తన్నీరు హరీష్‌రావు శనివారం హైద్రాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యువభారత్‌శక్తి ఫౌండర్ క్రాంతి, సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి 59 దరఖాస్తులు

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకానికి 59 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండల తహసీల్దార్ ఎస్.తిరుమలాచారి శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. మామునూరులో 38 మంది, బనిగండ్లపాడులో 21 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుల గడువు ముగియడంతో వీరి దరఖాస్తులను పరిశీలన చేసి త్వరలో అర్హులకు పరీక్ష నిర్వహించి నియామక ప్రక్రియ పూర్తిచేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలోని ఫీడర్-1 మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని శనివారం ఏఈ శరత్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి పట్టణంలోని జలగంనగర్, ఎన్టీఆర్‌నగర్, కృషిరోడ్, విద్యానగర్‌రోడ్, వాణి విద్యాలయం రోడ్, తుమ్మూరి రామారావురోడ్, వేంసూరురోడ్‌లలో ట్రీ కటింగ్ చేస్తుండటంతో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ముదిగొండ: మండలంలో పలువురి లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పంపిణీ చేశారు. ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.4,67,500ల చెక్కులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష,కార్యదర్శులు లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, రైతు సమితి మండల కన్వీనర్ ప్రసాద్, నాయకులు వెంకన్న, శిల్వ రాజు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు తీసుకున్న లబ్ధిదారులతో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, తదితరులు

శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం అన్నారుగూఎం నుంచి గోపాలపేట వరకు చేపట్టిన బీటీ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన గావించారు. రూ.60 లక్షల వ్యయంతో బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయనున్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య సహకారంతో ఈ నిధులు మంజూరైనట్లు ఎంపీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొడ్డా చిన్న శ్రీనివాసరావు, కృష్ణయ్య, దేవేందర్, మదార్ సాహెబ్, నాగు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెనుబల్లి: అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కారాయిగూడెం తండాకు చెందిన దేసిన్ని రవి(37) కడుపు నొప్పి భరించలేక శుక్రవారం కలుపు మందు తాగాడు. దీంతో ఆయనకు కుటుంబ సభ్యులు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారుజామున మృతి చెందాడని ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

జీయో 5జీ సేవలు ప్రారంభం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలో జీయో 5జీ సేవలను మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ నరేందర్‌రెడ్డి, గౌస్‌ఖాన్, మేనేజర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా యాత్రకు తరలిన నాయకులు

కొణిజర్ల: రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని చేపట్టిన రైతు భరోసా యాత్రకు శనివారం కొణిజర్ల మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వెళ్లారు. మాజీ ఎంపీ పొంగులేటి నేతృత్వంలో నిర్వహించిన ఈ యాత్ర ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్ నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగింది. యాత్రకు వెళ్లిన వారిలో ఎంపీపీ గోసు మధు, ఆత్మ కమిటి చైర్మన్ శ్రీను, పెద్దమునగాల సర్పంచ్ శ్రీనివాసరావు, నాయకులు పుల్లయ్య, మోష, సురేష్, లక్ష్మయ్య, ఆదినారాయణ, భాస్కర్ ఉన్నారు.

కబడ్డీ పోటీలు

కొణిజర్ల: మండలంలోని ఉప్పల చలకలో గుగులోత్ బిచ్చా సాధు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుడియా బాపు జాతరను పురస్కరించుకుని నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుగులోత్ బిచ్చా సాధు, శ్రీను, రాజా, రాజారాం, పీఈటీ బానోత్ శోభన్‌బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న చైనా కారం మిల్లు నుంచి వెలువడుతున్న మిర్చి కారం ఘాటు రాకుండా చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్ శిరీషకు శనివారం ముదిగొండ గ్రామస్తులు వినతి అందించారు. రాత్రి వేళ్లల్లో విపరీతంగా మిరప ఘాటు రావడంతో ఇళ్లల్లో నిద్రపోయే పరిస్థితి లేదని, వెంటనే అదుపుచేయాలని గ్రామస్తులు కోరారు. దీంతో స్పందించిన తహసీల్దార్ సోమవారం పరిశీలించి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా గుంత



ఎర్రుపాలెం మండలంలోని మామునూరు గ్రామంలో ప్రధాన రహదారిపై(బీటీ రోడ్డుపై) ఓ కల్వర్టు వద్ద ప్రమాదకరంగా గుంత పడింది. దీంతో కొందరు ఈ పరిస్థితిని చూసి గుంతలో కర్ర ఏర్పాటు చేసి ఓక్లాత్ కట్టారు. అయినప్పటికీ ఇది ఆర్అండ్‌బీ అధికారులకు మరి కనిపించలేదేమో కాని ఎటువంటి హెచ్చరిక సంకేతాలను ఏర్పాటు చేయలేదు. గుంత పూడ్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- ఎర్రుపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్, ఆర్అండ్‌బీ శాఖ ఏఈ, ఎర్రుపాలెం
సెల్ నంబర్ : 99123 40678